

దేశంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలతో పాటు మరణాలు సంభవించే మొదటి 100 జిల్లాల్లో చిత్తూరు కూడా ఉండడం శోచనీయం. నేషనల్ హైవేస్ అధికారులు విడుదల చేసిన లెక్కల ప్రకారం మన జిల్లా హై యాక్సిడెంట్ జోన్‌గా ఉందని మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. జిల్లాలో రోజుకొకరు చొప్పున రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారంటే తీవ్రత అర్థమవుతోంది.

రోడ్డు ప్రమాదాల్లో రోజుకొకరు బలి





మొగిలి ఘాట్‌లో ఓ ప్రమాదకర మలుపు

హై యాక్సిడెంట్ జోన్‌గా చిత్తూరు జిల్లా ● దేశంలోని మొదటి 100జిల్లాల్లో చోటు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	735	324	805
2022	711	373	792
2023	702	351	853
2024	734	389	877

చిత్తూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాలు ఆధ్యాత్మిక క్షేత్రాలకు నెలవైనందున రాష్ట్రంతో పాటు పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంది. చిత్తూరు- తిరుపతి, చెన్నై- బెంగళూరు, తిరుపతి- చెన్నై, రాణిపేట- కర్నూలు, పలమనేరు- కృష్ణగిరి వంటి జాతీయ రహదారులు జిల్లా మీదుగానే వెళ్తున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లూ ఎక్కువగానే ఉన్నాయి. రోడ్లన్నీ విస్తీర్ణం పెరిగి బాగుండడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డైతే 80-110 కి.మీ, కారు అయితే 120-140కి.మీ స్పీడు తగ్గకుండా ప్రయాణిస్తున్నారు.

● మొగిలి ఘాట్‌లో అత్యధికం

బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి ఘాట్ జిల్లాలో ప్రధాన ప్రమాదకర ప్రాంతంగా మారింది. 2019 నవంబరు 8న ఇక్కడ ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. గతేడాది సెప్టెంబరు 13న ఆర్టీసీ బస్సు ,లారీ ఢీకొని ఏడుగురు మరణించారు. ఇది సిమెంటు రోడ్డు కావడం, మలుపులు ఎక్కువగా ఉండడంతో ముందున్న వాహనాలు కనపడక ఒకదాన్ని మరొకటి ఢీ కొడుతున్నాయి. లగేజీతో చిత్తూరు వైపు వచ్చే భారీ వాహనాలు అదుపు తప్పి డివైడర్ దాటి అటు వైపు ప్రయాణించే వాహనాల మీదకు వెళ్లిపోతున్నాయి. ఏడుగురు మరణించాక కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని డివైడర్ సామర్థ్యాన్ని పెంచడం వంటి నివారణ చర్యలు తీసుకున్నారు. దీంతో కొంతమేరకు ఫలితం కనిపిస్తోంది.

● 25 ప్రాంతాల్లో ప్రమాదాలు..

జిల్లా రహదారుల్లో ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యే 25 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. మొగిలి ఘాట్, ఎన్‌హెచ్-69లో దొరచెరువు, ఎన్‌హెచ్-42లో గొల్లపల్లె క్రాస్, దేవదొడ్డి, కుప్పం బైపాస్‌లోని కేసీ ఆసుపత్రి, ఎన్‌హెచ్-40లోని మురకంబట్టు జంక్షన్, ఎన్‌హెచ్-140లోని తాళ్లగుండ్లపల్లె క్రాస్, పి.కొత్తకోట అండర్ బ్రిడ్జి, ఎన్‌హెచ్- 716లోని కన్నమిట్టకు ఎదురుగా హెచ్‌పీ పెట్రోల్ బంకు ప్రాంతాల్లో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాదారుల్ని అప్రమత్తం చేసేందుకు ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు.

● సగానికిపైగా ద్విచక్రవాహనదారులే..

గత ఏడాది 25 బ్లాక్ స్పాట్లలో మాత్రమే 458 ప్రమాదాలు జరిగాయి. 228 మంది మరణించగా, 510 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన 228 మందిలో 138 మంది ద్విచక్ర వాహనదారులే. ప్రస్తుత ఏడాది జూన్ వరకు 104మంది మరణించగా, 303 మంది గాయపడ్డారు. ఇక్కడ కూడా ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా బాధితులుగా మారుతున్నారు.జిల్లా మొత్తంలో చోటు చేసుకున్న ప్రమాదాలను చూసుకుంటే ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుంది. హైవేలో ప్రయాణించే వారు హెల్మెట్లను కచ్చితంగా ధరించాలనే నిబంధనను చాలామంది పాటించడం లేదు.



వైభవంగా గరుడ వాహనసేవ

తిరుమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గరుడపంచమి సందర్భంగా మంగళవారం తిరుమలలో గరుడవాహనసేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర హారతులు, గోవిందనామస్మరణల మధ్య మాడవీధుల్లో విహరించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇలా రిజిస్ట్రేషన్.. అలా చేతికి డాక్యుమెంట్లు
వాట్సాప్ ద్వారా సాధ్యం చేయనున్న ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులువుగా, క్షణాల్లో అందించేలా డిజిటల్ గవర్నెన్స్‌ను విస్తరిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో పలు మార్పులు తీసుకొస్తోంది. ఇప్పటికే 'మనమిత్ర' పేరుతో వాట్సాప్ ద్వారా సుమారు 300 సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో మరో కొత్తసేవను అందుబాటులోకి తెచ్చారు. ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే కొనుగోలుదారుడి వాట్సాప్ నెంబరుకు ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ వచ్చేస్తుంది. ఆగస్టు ఒకటో తేదీనుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగర పాలక సంస్థల పరిధిలో ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది.


మధ్యవర్తుల ప్రమేయం లేకుండా.. : ఇప్పటివరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాక ఆయా పత్రాలు (డాక్యుమెంట్లు)ను డాక్యుమెంట్ రైటర్లు తీసుకుని కొనుగోలుదారులకు ఇచ్చేవారు. వారికి ఎంతోకొంత ముట్టజెప్పాల్సి వచ్చేది. ఇప్పుడు మీడియేటర్ల ప్రమేయం లేకుండానే వాట్సాప్ ద్వారా నేరుగా డాక్యుమెంట్ పంపించేలా రిజిస్ట్రేషన్ శాఖ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను నవీకరించింది. పత్రాలను డిజిటల్ స్కానింగ్ చేసిన తర్వాత కొనుగోలుదారుడి ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్‌నెంబరు వాట్సాప్‌కు వెళ్లిపోతాయి. కొనుగోలుదారుడు డౌన్‌లోడ్ చేసుకుని వాటిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు. తర్వాత ఎప్పుడైనా కార్యాలయానికి వచ్చి డాక్యుమెంట్ నెంబరు చెప్పి బయోమెట్రిక్ వేసి, దస్తావేజులను తీసుకోవచ్చు.

చెంగనపల్లె నర్సరీ వద్ద చిరుత సంచారం

ఐరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఐరాల తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని చెంగనపల్లెకు సమీపాన ఉన్న అటవీశాఖ నర్సరీలో మంగళవారం సాయంత్రం ఓ చిరుత కనిపించిందని అక్కడ పనిచేసేవారు డీఆర్వో రాజేష్‌కుమార్‌కు తెలియజేశారు. నర్సరీ వద్ద చిరుత సంచరిస్తుండటం వలన అడవిలో పశువులను మేపడానికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని డీఆర్వో హెచ్చరించారు. అలాగే చిత్తూరు-ఐరాల ప్రధాన రహదారి కావడం వల్ల రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు, ఉదయం వాకింగ్ చేసేవారూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

నలుగురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఎస్పీ మణికంఠ ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ సీఐగా ఉన్న నిత్యబాబును చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్‌కు బదిలీ చేశారు. అక్కడ సీఐగా శ్రీనివాసరావును మహిళా పోలీసు స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న లక్ష్మీనారాయణను చిత్తూరు ట్రాఫిక్‌కు, ఇప్పటి వరకు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐగా ఉన్న మహేశ్వరను రెగ్యులర్ సీఐగా నియమించారు.



● నేటి సాయం సంధ్య వేళ..

మల్బరీ పంట తొలగింపు

● అధికారి తీరుతోనే అన్న రైతు

తిరుపతి రూరల్,జూలై29(ఆంధ్రజ్యోతి): సరైన ప్రోత్సాహం లభించడంలేదని తిరుపతి రూరల్ మండలం వేమూరులోని రైతు అయ్యప్పనాయుడు తన ఒకటిన్నర ఎకరాలోని మల్బరీ పంటను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పలమనేరు పట్టు పరిశ్రమ మార్కెటింగ్ అధికారి తీరుతో విసిగి ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో పనిచేసిన అధికారి నాణ్యమైన గూళ్లను గుర్తించి మంచి ధర వచ్చేలా కొనుగోలుదారులు, రైతులను సమన్వయం చేసేవారు. ఆ స్థానంలో వచ్చిన ప్రస్తుత మార్కెటింగ్ అధికారి పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు రైతులు ఇబ్బంది పడుతున్నారు. బయట ప్రాంతాల నుంచి నాణ్యమైన గూళ్లు వస్తున్నా సరైన ధరతో కొనడం లేదు. దీనికి మార్కెటింగ్ అధికారి సమన్వయలోపమే కారణం' అని వివరించారు. కాగా, గతవైసీపీ హయాంలో మల్బరీ సాగుకు ఎలాంటి ప్రోత్సాహమూ ఇవ్వలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించినా, మార్కెటింగ్ అధికారి సమన్వయలోపం తమకు శాపంగా మారిందని రైతులు అంటున్నారు.


జేసీబీతో మల్బరీ పంటను తొలగించిన రైతు

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.5.44 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,044

తలనీలాలు సమర్పించినవారు: 28,478



'నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనున్నాం. ఇది భూఉపరితల పరిశీలన, వాతావరణం మార్పుల అధ్యయనానికి ఉపయోగపడుతుంది. కేవలం 12 రోజుల్లోనే భూగోళమంతా తిరిగే సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఉపగ్రహంలో ఇస్రో ఎస్-బ్యాండ్, నాసా ఎల్-బ్యాండ్ పేలోడ్స్ అమర్చాం. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 40 రోజుల తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయి.

- వి.నారాయణన్, ఇస్రో చైర్మన్

'గగనయాన్ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే పరిశోధనలు మొదలయ్యాయి. అందుకు అవసరమైన వెహికల్స్‌ను, ఆస్ట్రోనాట్ టీంను సిద్ధం చేస్తున్నాం.

- ఉన్నికృష్ణన్ నాయర్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్


చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ నారాయణన్, పక్కనే శాస్త్రవేత్తలు ఉన్నికృష్ణన్ తదితరులు

షార్‌లో రాకెట్ ప్రయోగం

సూళ్లూరుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): షార్‌లో బుధవారం సాయంత్రం 5.40 గంటలకు రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఇస్రో-నాసా ఉమ్మడిగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఈ ప్రయోగ నేపథ్యంలో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. మన.. అమెరికా శాస్త్రవేత్తలతో పాటు ఇస్రోలోని అన్ని సెంటర్ల డైరెక్టర్లు షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. అన్నీ సజావుగా సాగితే నిర్దేశిత సమయంలో జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని రోదసిలోకి చేర్చనున్నారు. మరోవైపు భద్రతను కట్టుదిట్టం చేశారు. జల మార్గంలో కోస్టల్ గార్డులచే.. షార్ చుట్టూ పక్కల అడవుల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో జల్లెడ పడుతున్నారు.

దేవాలయాల్లో పూజలు

తిరుమల/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి: జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 ప్రయోగం విజయవంతం కావాలంటూ రాకెట్ నమూనాతో మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. శ్రీవారి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్తా, చైర్మన్ పీఎస్ యశోద, సైంటిఫిక్ సెక్రటరీ జయంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడినీ దర్శించుకున్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రత్యేక పూజలు చేశారు. వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి దర్శన ఏర్పాట్లు చేశారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

'పోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణలో లేని పిల్లలకు ప్రత్యామ్నాయ రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పోస్టర్ కేర్' విధానాన్ని బలోపేతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. పోస్టర్ అడాప్షన్ గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పోస్టర్ కేర్ విధానం ద్వారా పిల్లలు మానవీయ విలువలతో పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సాధారణ కుటుంబ వాతావరణంలో జీవిస్తూ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానసిక సహాయ సేవలు పొందే హక్కును పొందుతారన్నారు. జిల్లా బాలల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోస్టర్‌కేర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అనర్హ తల్లిదండ్రులు, సంరక్షణలో లేని పిల్లలను గుర్తించి అర్హులైన కుటుంబాల వద్ద తాత్కాలికంగా, దీర్ఘకాలింగా ఉంచే ప్రక్రియను చేపడతారని వివరించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ వెంకట్రావు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీఈవో కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయండి

జిల్లాలో పీ4 కార్యక్రమాన్ని వేగవంతం చేసి బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించి ఆగస్టు 4వ తేదీ నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను రీఓపెన్‌కు తావులేకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి అందించాలన్నారు. కాంట్రాక్టు, రోజువారీ కూలీలకు కనీస వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉచిత ప్రయాణంపై మెరుగైన చర్యలు తీసుకోండి

● రవాణా మంత్రి, ఆర్టీసీ ఎండీ సూచన

తిరుపతి(ఆర్టీసీ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలుకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తూ, మెరుగైన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యాపీఠంలో ఈ పథకం అమలుపై మంగళవారం జరిగిన తొలి సన్నాహక సమావేశంలో వీరు మాట్లాడారు. ఆక్యుపెన్సీరేషియో, లోడ్ పెరిగే క్రమంలో కొన్ని బస్సులు మొరాయించే అవకాశాలున్నాయన్నారు. బస్సుల సామర్థ్యం మెరుగుపరచాలని, ఫిట్‌గా ఉంటేనే గ్యారేజీ నుంచి బయటకు పంపాలని సూచించారు. విడిభాగాలను నిల్వ ఉంచుకోవాలని, మరమ్మతుల వల్ల ఆలస్యం కాకూడదన్నారు. కాలంచెల్లిన సాంకేతిక, ఇతర విడి భాగాలను తక్షణమే మార్చాలన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్ల ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని సూచించారు. కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల డిపీటీవోలు, సీనియర్ ఆఫీసర్లు, డీఎంలు హాజరయ్యారు.


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి, ఆర్టీసీ ఎండీ

● వెంకటగిరి ఏపీఎస్పీ బెటాలియన్

అదనపు కమాండెంట్‌కు పదోన్నతి

తిరుపతి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీఎస్పీ 9వ బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా పనిచేస్తున్న ఎం.అరుణ్‌బోస్‌కు కమాండెంట్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన్ను విశాఖలోని ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరలక్ష్మీ వ్రతానికి రేపు టిక్కెట్లు జారీ

తిరుచానూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు.భక్తులు నేరుగా వ్రతంలో పాల్గొనేందుకు గురువారం ఉదయం 9గంటలకు ఆన్‌లైన్‌లో 150 టిక్కెట్లను అధికారులు విడుదల చేయనున్నారు. ఆలయం కౌంటర్‌లో ఆగస్టు 7న కరెంట్ బుకింగ్‌లో 150 టిక్కెట్లు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీవారిమెట్టు మార్గంలో గజ బీభత్సం

● వరి, మామిడి తోటల ధ్వంసం ● గంటన్నర ఆలస్యంగా భక్తులకు అనుమతి


దెబ్బతిన్న అరటితోట


ధ్వంసమైన వరి పంట

చంద్రగిరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు మార్గంలో సోమవారం రాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. రాత్రి 8.30 గంటలకు 11 ఏనుగులు ఈ మార్గంలోని పంప్ హౌస్, మయూర డైరీ ఫామ్, శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, సత్యసాయి ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో తిరుగుతూ భయాందోళన కలిగించాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సిబ్బందితో వెళ్లి డ్రోన్ల ద్వారా ఏనుగుల సంచారాన్ని గుర్తించారు. వీటిని శేషాచలం అడవుల్లోకి మళ్లించడానికి ప్రయత్నించారు. ఈలోగానే అవి సత్యసాయి ఎస్టీ కాలనీ సమీపంలో మేడసాని ఆనందనాయుడికి చెందిన మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. చెంచయ్య వరి పొలాన్ని తొక్కేశాయి. మంగళవారం ఉదయం 6.30 గంటలకు ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని తెలిశాక రైతులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో సాధారణంగా రోజూ ఉదయం 5 గంటలకే భక్తులను అనుమతిస్తారు. ఏనుగుల సంచార సమాచారంతో 6.30 గంటలకు శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టుకు బస్సుల్లో అనుమతించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఈ ప్రాంతాల ప్రజలతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. ఏనుగుల కదలికల గురించి తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● అవగాహన సదస్సులో ప్రిన్సిపాళ్లకు వివరించిన ఆర్‌ఐవో



తిరుపతి(విద్య), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యావిధానంలో కొత్త సంస్కరణలపై అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించారు. తిరుపతిలోని టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్‌ఐవో రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. సిలబస్ మార్పు, సబ్జెక్టుల కాంబినేషన్, ప్రశ్నపత్రంలో మార్పుల గురించి విశదీకరించారు. ఏపీఈఏపీసెట్, నీట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధంపై వివరించారు. ఇంటర్ విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్‌ఈసి గ్రూపులు తీసుకుంటున్నారన్నారు. ఈ గ్రూపు సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లిష్, పార్ట్-2లో ద్వితీయ భాషగా ఏదేని ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. ఎంపీసీ విద్యార్థులు అదనంగా 6వ సబ్జెక్ట్‌గా బయాలజీని, బైపీసి విద్యార్థులు మ్యాథమేటిక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. అదనపు సబ్జెక్టును ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలు ఏపీఈఏపీసెట్, నీట్ రెండింటికీ రాయవచ్చన్నారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బి సబ్జెక్టులను విలీనంచేసి మ్యాథమేటిక్స్‌గా, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను విలీనంచేసి బయాలజీగా ఈఏడాది ప్రథమ సంవత్సర విద్యార్థులకు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్పులు వర్తిస్తాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ సందేహాల నివృత్తికి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటికి తాళం కనిపిస్తే చాలు..!

● రాత్రికి దొంగతనం చేస్తాడు

● నిందితుడి అరెస్టు..

248.7 గ్రాముల బంగారు స్వాధీనం


మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం),జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శ్రీకాళహస్తి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి తొమ్మిది కేసులకు సంబంధించి దాదాపు రూ.27 లక్షల విలువచేసే 248.7 గ్రాముల బంగారు నగలు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, బోడిగాడితోటకు చెందిన మీదూరి సునీల్ కొన్నేళ్లుగా చెడు వ్యసనాలకు లోనయ్యాడు. జల్సాల కోసం దొంగతనాలు మొదలు పెట్టాడు. రాత్రి పూట తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలుచోట్ల దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో నెల్లూరు జిల్లా పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో సుమారు 28 కేసులు నమోదయ్యాయి. కొన్ని చోట్ల రిమాండుకూ వెళ్లాడు. ఇతడిపై నెల్లూరు టూటౌన్ స్టేషన్‌లో డీసీ షీట్ నమోదైంది. ఆ తర్వాత శ్రీకాళహస్తి ఒకటవ, రెండవ పోలీసుస్టేషన్లతో పాటు బీఎన్ కండ్రిగ, నాయుడుపేట, గూడూరు పోలీసుస్టేషన్ల పరిధిలో దాదాపు తొమ్మిది ఇళ్లల్లో దొంగతనం చేశాడు. తాళం వేసి వున్న ఇళ్లను గమనించి రెండు, మూడు రోజులు రెక్కీ నిర్వహిస్తాడు. ఆ తర్వాత ఇంటి తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో చోరీల కేసులను ఛేదించడానికి ఎస్పీ హర్షవర్ధన రాజు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి నేతృత్వంలో వన్‌టౌన్ సీఐ గోపి, తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులు, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకరయ్య, అరుణ్‌కుమార్, భరత్, బాలకృష్ణ, బాబు, గంగాధర్, చటర్జీలతో ప్రత్యేక బృందాలను నియమించారు. వీరు రెండు నెలలుగా ఇతడిపై నిఘా ఉంచారు. అతడి కదలికలను గుర్తుపట్టి సోమవారం నెల్లూరు పట్టణం, వెంకటేశ్వరపురం వద్ద సునీల్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి మూడు మోటారు సైకిళ్లతో పాటు దాదాపు 248.7 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందచేశారు.

రెండు నెలల్లో 75 మంది అరెస్టు

జిల్లావ్యాప్తంగా రెండు నెలల వ్యవధిలో జరిగిన చోరీలు, ఇంటి దొంగతనాలు, కన్నపు నేరాలకు సంబంధించి 75 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.10 కోట్ల చోరీ సొత్తు రికవరీ చేశారు. చోరీ కేసులు ఛేదించడానికి అనుభవజ్ఞులైన పోలీసు బృందాలను రంగంలోకి దింపడం, వారి పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెట్టడంతో ఆ బృందాలు కేసులను ఛాలెంజ్‌గా తీసుకుని రికవరీ చేయడంలో విజయం సాధించారు. ఈ ఏడాది చివరి నాటికి వివిధ కేసులకు సంబంధించి 70 శాతం డిటెక్షన్‌తో 80 శాతం రికవరీ సాధిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఊర్లకు వెళ్లినప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


జేఎన్‌టీయూ వీసీతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

స్కిట్ నేలను ముద్దాడుతున్న సుధీర్‌రెడ్డి

మంత్రి లోకేశ్ కృషితోనే 'స్కిట్' పునఃప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగానే స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభించగలిగామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి ఎంసెట్ కౌన్సిలింగ్‌లో స్కిట్ కళాశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో అనంతపురం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు స్కిట్ కళాశాలకు చేరుకున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కూటమి నేతలు కళాశాలను సందర్శించారు. ముందుగా కళాశాల ప్రాంగణం ప్రవేశద్వారం వద్ద నేలను ఎమ్మెల్యే ముద్దాడారు. స్కిట్ పునః ప్రారంభం ద్వారా తండ్రి (బొజ్జల గోపాలకృష్ణారెడ్డి) ఆశయాన్ని బతికించాడంటూ బృందమ్మ కుమారుడిని ఆలింగనం చేసుకున్నారు. కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించాక ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో విలేకరులతో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి స్కిట్ కళాశాల మూత ఓ నిదర్శనమన్నారు. తన తండ్రి స్థాపించిన కళాశాలను తిరిగి జేఎన్‌టీయూతో అనుసంధానం చేసి పూర్వవైభవం తీసుకొస్తానన్న హామీని నెరవేర్చడం మరచిపోలేని విషయమన్నారు. దీనికి మంత్రి నారా లోకేశ్ ఎంతగానో సహకరించారన్నారు. ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు శక్తివంచన లేకుండా శ్రమించారని అభినందించారు. రాబోయే రెండు మూడేళ్లలో గతం కన్నా రెట్టించిన స్థాయిలో స్కిట్ కళాశాలకు మంచిపేరుతో పాటు డిమాండ్ వచ్చేలా మెరుగైన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే తరగతి గదులను మంత్రి లోకేశ్ చేతులమీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు, విజయకుమార్, కంఠా రమేష్, కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఇంజనీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దుతాం

'స్కిట్'ను అత్యున్నత విద్యాబోధనతో ఉన్నత కళాశాలగా తీర్చిదిద్దుతామని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు భరోసా ఇచ్చారు. తామంతా స్కిట్ కళాశాల ఖ్యాతిని చూసి గతంలో ఎంతో సంతోషపడేవారమన్నారు. కొన్ని అనివార్య కారణాలతో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి, నాలుగేళ్ల క్రితం కళాశాల మూతపడిన సమయంలో తామంతా ఎంతో కలత చెందామన్నారు. అంతటి కళాశాలను రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయిలో నిలబెడతామని చెప్పారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

తిరుపతి(ఆటోనగర్), జూలై 29(ఆంధ్రజ్యోతి): తొలినుంచీ ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి వెల్లడించారు. సూళ్లూరుపేటలో ఆగస్టు 3న జరిగే సీపీఐ 2వ మహాసభల ప్రచార గోడ పత్రికలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. జె.విశ్వనాథ్, కె.వై.రాజా, ఎన్.శివ, నాగరాజు, పద్మనాభరెడ్డి, కాశయ్య, రత్నమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై చట్టపర చర్యలు

● కలెక్టర్ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎరువుల చట్టం నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో హెచ్చరించారు.గత జూన్‌నెలలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేయకపోయినా ఇక యూరియా దొరకదన్న అపోహతో ప్రైవేటు ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు బారులు తీరడం గమనించామన్నారు.వ్యవసాయశాఖకు సంబంధించి 8142 హెక్టార్ల పంట మాత్రమే సాగు కాగా జూలై దాకా 7910 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయన్నారు. యూరియా ఇక దొరకదన్న అపోహతో అధిక ధరలకు కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వచేసుకుంటున్నారన్నారు. ఇది చట్టరీత్యా నేరమని, ప్రతి రైతు తమ అవసరాలకు ఒక బస్తా యూరియాను మాత్రమే కొనుగోలు చేయాలి తప్ప, రెండు మూడు బస్తాలు కొనుగోలు చేసి ఇళ్లల్లో నిల్వచేసుకోరాదన్నారు. ఎరువుల వ్యాపారస్థులు కూడా రైతుల అవసరానికి మించి అధిక ధరలకు విక్రయించినా, నిల్వలు చీకటి బజారుకు తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు కూడా వీటిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఒకవేళ అధికారులు విధినిర్వహణలో అలక్ష్యం ప్రదర్శిస్తే, వారిపై కూడా చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మణీంద్రం ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల

చిత్తూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రం ఎంపీటీసీ స్థానానికి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల అధికారి మంగళవారం జారీ చేశారు. ఈ విషయాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు వెల్లడించారు. మణీంద్రం ఎంపీటీసీ శాంతికుమారి మరణించడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి 30వ తేదీన నామినేషన్ దాఖలు, ఆగస్టు 1న స్వీకరణ, చివరి రోజు, 2న పరిశీలన, 3న అభ్యంతరాల స్వీకరణ, 4న పరిష్కారం, 5న నామినేషన్ ఉపసంహరణ, అభ్యర్థులు ప్రకటన, 12న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఉప ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

11న కాంట్రాక్టు జేఎల్‌ల ధర్నా

చిత్తూరు సెంట్రల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తమ సర్వీసు క్రమద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు(జేఎల్‌లు) వచ్చేనెల 11వ తేదీన ఆయా కళాశాలల వద్ద ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి లత, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌నాయుడు, గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నెలల జీతభత్యాల చెల్లింపులను తిరిగి అమలు చేయాలని, మే 2024, మే 2025 పెండింగ్‌లోని వేతనాలు విడుదల చేయాలని, 62 సంవత్సరాల వయోపరిమితి తదితర సమస్యల పరిష్కారానికి ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు.

నాటుబాంబుల కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం 102.ఈ రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ చిగురమాకులపల్లి వద్ద మంగళవారం నాటుబాంబుల కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 26వ తేదీన వ్యవసాయ పొలంలో మేత మేస్తున్న పాడి ఆవు నాటు బాంబు నమలడంతో తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులైన చిగురమాకులపల్లికి చెందిన కృష్ణమాచారి, అతని కుమారుడు మునిసుబ్రహ్మణ్యంలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 19 నాటు బాంబులు, నాటు తూపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫైనాన్సు కంపెనీలో గోల్‌మాల్ కేసులో మరికొందరి అరెస్టు

పలమనేరు, జూలై29 (ఆంధ్రజ్యోతి) : ఆరునెలల క్రితం పలమనేరులోని ఓ ఫైనాన్సు కంపెనీలో నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి డబ్బులు స్వాహా చేసిన సంఘటనలో త్వరలోనే పోలీసులు మరికొందరిని అరెస్టు చేయనున్నారు.20కిలోల బంగారు తాకట్టుపెట్టి దాదాపు రూ.9కోట్లు తీసుకున్నట్లు గుర్తించిన పోలీసులు బాధ్యులుగా 26 మందిని గుర్తించారు. వారిలో 13 మందిని అరెస్టు చేశారు.మిగిలిన 13మందితో పాటు మరికొందరు నిందితులను కూడా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.వీరిలో కొందరు నెలన్నర క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లి ముందస్తు బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.స్వాహా చేసిన నగదును నిందితులు రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మహిళపై దాడి కేసులో ఏడాది జైలు

పూతలపట్టు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై దాడి చేసిన వ్యక్తికి చిత్తూరు న్యాయస్థానం ఏడాది జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. చిన్నగొట్టిగల్లు మండలం గొట్టూరువారిపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ రెడ్డి అదే గ్రామానికి చెందిన శారద అనే మహిళ ఇంటికి తరచూ వెళ్లి వచ్చేవాడు. 2014 జూన్ 16వ తేదీన విశ్వనాథ రెడ్డి ఆమె ఇంటికి వెళ్లగా, తన ఇంటికి ఇకపై రావద్దని చెప్పింది. దీంతో శారదపై విశ్వనాథరెడ్డి ఇనుపరాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు బాకరాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అతడిని రిమాండుకు తరలించారు. ఈ కేసు మంగళవారం ఫస్ట్ ఏడీజే కోర్టులో వాయిదా ఉండగా పూర్వాపరాలు పరిశీలించాక నేరం రుజువుకావడంతో విశ్వనాథరెడ్డికి ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ ఎం.చంద్రశేఖర్ వాదించారు.

పగిలిన ఆర్టీసీ బస్సు టైరు

ఇరుకు రోడ్డుపై ఆగడంతో ఇబ్బందిపడ్డ వాహనదారులు



రోడ్డుపై ఆగిన బస్సు

పాలసముద్రం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వెంగళ్రాజుకుప్పం ప్రభుత్వ హాస్టల్ వద్ద మంగళవారం ఉదయం ఏడు గంటలకు చిత్తూరు నుంచి బలిజకండ్రిగ వచ్చే ఆర్టీసీ బస్సు ముందు టైరు పగిలి ఆగిపోయింది. అక్కడ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. టైరు మార్చడానికి సుమారు గంట సమయం పట్టడంతో అప్పటివరకు బలిజకండ్రిగ నుంచి బెంగళూరుకు వెళ్లే కర్ణాటక ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. ట్రాఫిక్ స్తంభించింది.

13 కిలోమీటర్లు సింగిల్ రోడ్డు

బలిజకండ్రిగ నుంచి చిత్తూరుకు వెళ్లే రహదారి పుల్లయ్యగుంట వరకు 13 కిలోమీటర్లు సింగిల్ రోడ్డుగా ఉంది. ఈ మార్గంలోనే కొందరు రైతులు రోడ్డు ఆక్రమించడం వల్ల జనానికి మరిన్ని కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డు వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం రాయితీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50శాతం రాయితీ కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీచేయాలని డీఆర్వో, డీఈవోలకు ఆదేశాలు జారీచేశారు.

యూరియా వినియోగంపై ప్రభుత్వం నిఘా!

ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ● తరచూ ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఫయాజ్ బాషా

కుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యూరియా వినియోగంపై ప్రభుత్వం నిఘా పెట్టింది. రైతుకు మేలు చేసే ఉద్దేశంతో, అదే సమయంలో ఇంకో రైతుకు కొరత పడకూడదన్న కారణంతో ప్రభుత్వాధికారుల చేత తరచూ ఎరువుల దుకాణాలు తనిఖీ చేయిస్తోంది. యూరియా పరిమితికి మించి వాడడంవల్ల నేల సారవిహీనమవుతుంది. అదే సమయంలో మరో రైతుకు యూరియా దొరక్కుండా పోతుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కలిగించేందుకు వ్యవసాయాధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు.

ఉదాహరణకు కుప్పం నియోజకవర్గంలో యూరియా నిల్వలు సరిపడినంత ఉన్నాయి. ఒక్క కుప్పం మండలంలోనే 70 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం సరఫరా చేసింది. మిగిలిన గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో సైతం యూరియా నిల్వలు సరిపడినంత ఉన్నాయి. రూ.1455 ధర కలిగిన 50 కిలోల బస్తాను రైతుకు సబ్సిడీ మీద కేవలం రూ.267కే ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. దీని వల్ల రైతుల్లో యూరియాకు విపరీతమైన డిమాండు ఏర్పడింది. నియోజకవర్గంలో ప్రస్తుతం వేరుశనగ, వరి, మొక్కజొన్న, రాగి, టమోటా, బీన్స్ చేమంతి, బంతి వంటి వివిధ రకాల కూరగాయలు, ఉద్యాన పంటలు, అధికంగా సాగులో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వానలు కూడా ప్రారంభయ్యాయి. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు ఈ-పంటలో పేర్లను నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అది కూడా ఒక రైతుకు ఒక బస్తా తీసుకోవడానికి మాత్రమే వారికి అనుమతి ఇస్తున్నారు. ఎరువుల దుకాణ యజమానులకు సైతం ఇదేరకమైన ఆదేశాలు జారీ చేశారు. యూరియా పరిమితికి మించి వాడడం వల్ల భూసారం సమీప భవిష్యత్తులో తగ్గి, సాగుకు పనికిరాకుండా పోతుంది. అదే సమయంలో యూరియా కొరత ఏర్పడి, నిజంగా అవసరమైన రైతుకు దొరకపోవడంవల్ల పంటకు నష్టం వాటిల్లుతుంది. మరీ కుప్పం నియోజకవర్గం అంతర్రాష్ట్ర కూడలిలో ఉండడంవల్ల పక్క రాష్ట్రాలకు మన యూరియా అక్రమంగా రవాణా అయి, కొరత అధికమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు యూరియా వినియోగంపై గట్టి నిఘా ఉంచారు. యూరియాకోసం తమ దగ్గరకు వస్తున్న రైతుల్లో వినియోగంపై అవగాహన కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కచ్చితంగా ఒకే బస్తాకు అనుమతులు ఇస్తున్నారు. ఇంతకుమించి యూరియా కావాలంటే సాగులో ఉన్న పంటలను స్థానిక రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, ఆ వివరాలు నిజమైతేనే అవసరమైన అదనపు యూరియా బస్తాలు లభిస్తాయని కచ్చితంగా చెబుతున్నారు. అంతేకాదు, ఎరువుల దుకాణాలను తరచూ తనిఖీ చేస్తూ యూరియా నిల్వల గురించి, విక్రయాల గురించి ఆరా తీస్తున్నారు. సంబంధిత రికార్డులు తనిఖీలు చేస్తూ దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. కుప్పం మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా సోమవారం మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విక్రయాల ప్రారంభం, ముగింపు రోజువారీ రికార్డులు తనిఖీ చేశారు. యూరియా వినియోగం, విక్రయాలపై దుకాణా యజమానులను సూచనలిచ్చారు. ఇదేరకమైన తనిఖీలు, యూరియా వినియోగంపై రైతుల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు ఇతర మండలాల్లో కూడా ఆయా వ్యవసాయాధికారులు చేస్తున్నారు. అంతిమంగా రైతులందరికీ మేలు చేయాలన్నది ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ అవగాహన కార్యక్రమాల లక్ష్యంగా ఉంటోంది.

ఆరుగురు తమిళనాడువాసుల అరెస్టు

● చోరీ కేసుల్లో 18 ద్విచక్రవాహనాల స్వాధీనం





స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో డీఎస్పీ తదితరులు - ఎస్ఐ శ్రీనివాసులుకు రివార్డు ప్రదానం

గుడుపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి సుమారు రూ.10 లక్షల విలువైన చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను గుడుపల్లె పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం గుడుపల్లె పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ పార్థసారథి మీడియాకు వివరాలను వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం మండలాల్లో కొన్ని నెలలుగా ఆరు ద్విచక్ర వాహనాలు చోరీ కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. కుప్పం రూరల్, అర్బన్ సీఐలు మల్లేష్ యాదవ్, శంకరయ్యల ఆధ్వర్యంలో గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్, రామకుప్పం ఎస్ఐ వెంకటమోహన్ బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన అరుణ్‌కుమార్, హరి, మోహన్, మణిగండన్, ముకేష్, దినేష్‌లు ద్విచక్ర వాహనంలో వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వీరిని వెంబడించి పట్టుకున్నారు. వీరిని విచారించగా గత కొన్ని నెలలుగా గుడుపల్లె, కుప్పం, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయించినట్లు తేలింది. వీరు శాంతిపురం మండలం కదిరి ఓబనపల్లెలోని ఓ షెడ్‌లో దాచిన 18 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణపై చురుగ్గా వ్యవహరించిన ఎస్ఐలు శ్రీనివాసులు, నరేష్, వెంకటమోహన్, క్రైమ్ సిబ్బంది, పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందించి అభినందించారు.

ఐరాల పీహెచ్‌సీకి మహిళా డాక్టర్‌ను నియమించండి

డీఎంహెచ్‌వోకు కలెక్టర్ ఆదేశం



ఐరాల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఐరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఐరాల పీహెచ్‌సీకి మహిళా డాక్టర్‌ను నియమించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు ఇచ్చారు. మంగళవారం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. మహిళా డాక్టర్ లేక పోవడంతో పీహెచ్‌సీకి వచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారని డాక్టర్ రెడ్డెప్ప తెలిపారు. స్పందించిన కలెక్టర్ వెంటనే డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి మహిళా డాక్టర్‌ను నియమించాలని చెప్పారు. అనంతరం రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కలెక్టర్ అందజేశారు. పీహెచ్‌సీ ముందు భాగంలో మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని చూసి ప్రశంసించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి: ఎస్ఈ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

పెనుమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. పెనుమూరు మండల విద్యుత్ కార్యాలయంలో మంగళవారం పేరుకుపోయిన విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఆయన సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. జీడీ నెల్లూరు ఏడీ శేషాద్రిరెడ్డి, పెనుమూరు ఏఈ తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల రికవరీపై దృష్టి పెట్టండి

సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా రుణాల రికవరీపై దృష్టి పెట్టాలని సిబ్బందిని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఆదేశించారు. మంగళవారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆమె ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. ఎకనామిక్ గ్రోత్ మార్పు నిర్వహణలో రాష్ట్రానికి జిల్లా ఆదర్శం కావాలన్నారు. మునగ పంట ఉత్పత్తుల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో ఉపయోగించే సాంకేతిక పరికరాల్లో భాగంగా డ్రోన్లను పెద్దమొత్తం రాయితీతో ఇస్తున్న క్రమంలో మహిళా సంఘం సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. డీపీఎంలు రవికుమార్, సునీతా, ఏపీఎంలు సుబ్బారెడ్డి, మధులు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అవమానంతో ఆత్మహత్య

● మృతుడి భార్యతోపాటు ఆమె ప్రియుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితులతో ఎస్ఐ రామకృష్ణ

కుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో భార్య వివాహేతర సంబంధం భరించలేక అవమానంతో ఓ భర్త ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు విచారించి కారకులైన భార్యతోపాటు ఆమె ప్రియుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కుప్పం అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం వి.మిట్టపల్లె గ్రామంలో కుపేంద్ర, కె.భార్గవి దంపతులు నివశిస్తుండేవారు. భార్గవి అదే గ్రామానికి చెందిన షేక్ మునీర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలుసుకున్న కుపేంద్ర గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించగా వారిద్దరినీ మందలించారు. అయినా భార్గవిలో మార్పు రాకపోగా వివాహేతర సంబంధం కొనసాగింది. గ్రామంలో అవమానాల పాలయ్యానన్న మనస్తాపంతో ఆమె భర్త కుపేంద్ర ఈనెల 26వ తేదీన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు భార్గవిని, ఆమె ప్రియుడు షేక్ మునీర్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

పరిహారం చెల్లించి పనులు చేయండి





కాడేపల్లె వద్ద హంద్రీ నీవా కాలువ పనులను నిలిపివేస్తున్న రైతులు

గుడుపల్లె, జూలై 29(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా కోసం భూములిచ్చి సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం రాలేదంటూ గుడుపల్లె మండలం కాడేపల్లె రైతులు మంగళవారం నిరసనకు దిగారు.హంద్రీ నీవా కాలవ నిర్మాణ పనులను అడ్డగించారు.సిరిగిరిపల్లె, ఒంటిపల్లె రెవెన్యూ గ్రామాల్లో వున్న కాడేపల్లె గ్రామస్తుల భూములను హంద్రీ నీవా ప్రాజెక్టు కోసం 8 సంవత్సరాల క్రితం ప్రభుత్వం సేకరించిందన్నారు.అందరికీ పరిహారం వచ్చిందని, 10మందికి మాత్రం ఇంతవరకు రాలేదన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నా నేడు, రేపు అంటూ చెబుతున్నారని వాపోయారు. రైతుల అడ్డగింతతో కాడేపల్లె వద్ద జరుగుతున్న హంద్రీ నీవా పనులకు మంగళవారం బ్రేక్ పడింది.

చిత్తూరు విద్యుత్‌శాఖ ఏవో బదిలీ

చిత్తూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు విద్యుత్‌శాఖ ఏవో ప్రసన్న ఆంజనేయులు పదోన్నతిపై కడప జిల్లా ఎస్ఏవో బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి ఎస్ఏవో శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.





మోడల్ పాఠశాలలోని సరుకులను పరిశీలిస్తున్న డీఈవో వరలక్ష్మి - ఎంపీశ్రీ స్కూల్ బోర్డును ప్రారంభిస్తున్న డీఈవో, టీడీపీ నాయకులు

మోడల్ స్కూల్ ఆవరణలో పారిశుధ్య లోపం

పుంగనూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఆవరణలో పారిశుధ్యం లోపించిందని డీఈవో వరలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.పుంగనూరు మండలంఅడవినాథునికుంటలోని మోడల్ స్కూల్ పీఎం శ్రీకి ఎంపిక కావడంతో మంగళవారం ఆమె స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గదులు, మధ్యాహ్న భోజన తయారీ భవనాన్ని పరిశీలించారు. భోజన వసతి భవనం వద్ద మురుగునీరు నిల్వ ఉండటం గుర్తించి ప్రిన్సిపల్ రమాపై మండిపడ్డారు.తాను మరో సారి వచ్చినప్పుడు కూడా ఇలా ఉంటే ఇంటికి పంపించేస్తానని హెచ్చరించారు. అనంతరం పీఎంశ్రీ బోర్డును ప్రారంభించారు. ఎంఈవోలు నటరాజరెడ్డి, రెడ్డెన్నశెట్టి, ఏఎంసీ చైర్మన్ శమీపతి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, రామకృష్ణ నాయక్, సుబ్రహ్మణ్యం, రామయ్య, గాంధీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 19 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 19మందికి జరిమానా విధించారు. రెండ్రోజులుగా చిత్తూరు నగరంలో వాహనాల తనిఖీచేపట్టి, మద్యం తాగి నడిపిన 19మందిపై కేసు నమోదు చేశారు. మంగళవారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా..జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పూజిత

రామకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచే వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలని విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత కోరారు. మంగళవారం ఆమె తమ సిబ్బందితో కలిసి విజలాపురం కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, మెదడువాపు తదితర వ్యాధుల కారకాలు, లక్షణాలు, చికిత్సలు, నిరోధక చర్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ బాలు, ఏఎన్‌ఎంలు శైలజ, అమరావతి, వేణమ్మ, నారాయణమ్మ, రాణెమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో

చౌడేపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కట్టెలపై వంటలు చేస్తున్నారని గుర్తించిన ఆమె ఇకపై గ్యాస్‌పైనే చేయాలని ఆదేశించారు. భోజనం నాణ్యతగా ఉండాలని.. రుచిగా, శుభ్రంగా తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలమ్మ, హెచ్‌ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గజదాడిలో మృతుడి కుటుంబానికి పరామర్శ



కొత్తూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జనసైనికులు

సోమల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన చెన్నూరి రామకృష్ణమరాజు ఏనుగుల దాడితో మృతి సంఘటనతో మంగళవారం జనసేన పార్టీ నాయకులు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏనుగుల దాడులల్లో మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు నష్టపరిహారం అందజేస్తుండగా కూటమి ప్రభుత్వం రూ. 10 లక్షలు అందజేయడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గజదాడులతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేందుకు చొరవ చూపుతామన్నారు. రామకృష్ణ, కోలా మోహన్, రఘు, మురళీ, విజయ్ కుమార్, ప్రభు, అభిషేక్, షబ్బీర్‌బాషా, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు మండల స్థాయి అధికారులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

● రూ.1.20 లక్షల విలువైన దుస్తులు, ఆభరణాల స్వాధీనం



దుస్తులు, ఆభరణాలతో నిందితుడి అరెస్టు చూపెడుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో ఇటీవల జరిగిన రెండు చోరీ కేసులకు సంబంధించి నిందితుడు మహే‌ష్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు బైరెడ్డిపల్లె ఎస్‌ఐ పరశురాముడు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. గత నెల 26వ తేదీన ఏఎస్ ఫ్యాషన్స్‌లో దుస్తులు, రూ. 10 వేలు నగదు చోరీ కావడం, అలాగే గతవారం పుంగనూరు రహదారిలోని ఓ ఇంట్లో వెండి, బంగారు ఆభరణాలు చోరీ జరగడంపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గంగవరం రూరల్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టగా మంగళవారం ఈ కేసుల్లో నిందితుడైన మహే‌ష్‌ను అరెస్టు చేసి అతడి నుంచి దాదాపు రూ.1.20 లక్షల విలువైన దుస్తులు, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



గ్రామస్థుల సమస్యలు వింటున్న తహసీల్దారు పార్వతి

చౌడేపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పార్వతి పేర్కొన్నారు. మంగళవారం ఏ కొత్తకోట పంచాయతీ సచివాలయంలో పౌర హక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా కులవివక్షత పాటించినా.. సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ దొరస్వామి, వీఆర్‌వో మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మునిరాజ, కిరణ్‌కుమార్, శ్రీరాములు, జగనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



కల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజల మన్ననలు పొందాలని టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, చెంగల్రాయనాయుడు, అరుణాచలంనాయుడు, గురుమూర్తి తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన సిబ్బంది, బాధ్యతలు చేపట్టిన సిబ్బందికి మంగళవారం సచివాలయంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో సచివాలయ సిబ్బంది మమేకం కావాలని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది పవనకుమారి, మల్లికార్జున్, రుకేష్, హరి, శోభావతి, లోకేష్, శ్రీలత, వేదవతి, సౌజన్య హరీష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, వీఆర్‌వో విజయ్‌కుమార్‌ను సన్మానించారు.



గాంధీజీ విగ్రహం



అమరజీవి విగ్రహం



ఎన్టీఆర్ విగ్రహం

ఆ విగ్రహాల తొలగింపుపై అయోమయం..!

● రోడ్డు విస్తరణకు ఎదురవుతున్న సమస్య



రోడ్డు విస్తరణలో అందంగా కనిపిస్తున్న కుప్పం చెరువు కట్ట

కుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి వాయిదా పడుతూ వచ్చిన నేతాజీ రోడ్డు విస్తరణ ప్రక్రియను ఒక కొలిక్కి తేవడానికి కడా పీడీ వికాస్ మర్మత్ స్థిర నిశ్చయంతో ఉన్నారు. దీనికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ప్రైవేటు భవనాల తొలగింపు, స్థలాల సేకరణతోపాటు విగ్రహాల తొలగింపు సమస్య తోడైంది. ప్రధాన రాజకీయ పార్టీల విగ్రహాలతోపాటు స్వాతంత్ర్య సమరవీరుల విగ్రహాలూ ఈ రోడ్డు వెంట ఉండటమే దీనికి కారణం. తొలగించబోతున్న విగ్రహాలను తిరిగి ఎక్కడ పునః ప్రతిష్ఠించాలన్న అంశంపై ప్రస్తుతం చర్చోపచర్చలు నడుస్తున్నాయి.

2014-2019 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారి అయిన నేతాజీ రోడ్డు విస్తరణ అంశం తెరమీదకు వచ్చింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పట్టణంలోని పాత రైల్వే గేటు వరకు ఈ రోడ్డును 60 అడుగుల మేర విస్తరించడానికి అప్పట్లో నిర్ణయించుకుని స్థానికులకు నోటీసులు జారీ చేశారు. రోడ్డును మూడు రీచ్‌లుగా విభజించి మొదటి రీచ్ అయిన కుప్పం ప్రభుత్వాస్పత్రి నుంచి చెరువు కట్ట వరకు పనులు పూర్తి చేశారు. ఈ రీచ్ పరిధిలో ఎక్కువగా ప్రభుత్వ స్థలాలు, భవనాలే ఉండటంతో పెద్దగా ఆటంకం ఏర్పడలేదు. అయితే రెండవ రీచ్ అయిన చెరువు కట్టనుంచి ఎమ్మార్ రెడ్డి కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన సమయంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. మొదట్లో కొన్ని భవనాలు కూలదోసిన తర్వాత కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కోర్టు గుమ్మం తొక్కడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు విస్తరణ కోసం టీడీపీ ప్రభుత్వంలో విడుదల చేసిన జీవోనే ఉపసంహరించుకున్నారు. మళ్లీ 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా)ను ఏర్పాటు చేసింది. కడా ప్రత్యేకాధికారి వికాస్ మర్మత్ తిరిగి నేతాజీ రోడ్డు విస్తరణ ప్రక్రియ ఫైలును కదిలించారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర స్థానమైన ఈ రోడ్డును విస్తరించి సుందరీకరించి తీరాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం మేరకు ఆయన ఇటీవల విస్తరణ పరిధిలోకి వచ్చే భవనాలు, స్థలాల యజమానులతో సమావేశమయ్యారు. విస్తరణ అనివార్యం అని ప్రభుత్వం ఘంటాపథంగా చెప్పడంతో అందుకు అందరూ అంగీకరించారు గాని.. అందుకోసం చెల్లించే నష్టపరిహారం విషయంలో సమస్య ముడిపడింది. మార్కెట్ రేటును ప్రైవేటు వ్యక్తులు కోరుతుండగా.. అదివీలుకాదని, సాధ్యమైనంత మేరకు ఎక్కువగానే వచ్చేలా చూస్తామని పీడీ అంటున్నారు.

● రంగంలోకి విగ్రహాల సమస్య

నష్టపరిహారం చర్చలు అలా నడుస్తుండగానే ప్రస్తుతం విగ్రహాల సమస్య మొదలైంది. కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మొదలు పెడితే నేతాజీ రోడ్డు చివరి వరకు పలు విగ్రహాలు నేతాజీ రోడ్డు వెంట మనకు కనిపిస్తాయి. ప్రభుత్వాస్పత్రి కూడలిలో కురబ జాతి ఆరాధ్యులు కనకదాస విగ్రహం ఉంది. కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు, మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలు ఉన్నాయి. వీటికి ఎదురుగా సెంట్రల్ పార్కు ప్రహరీని ఆనుకుని స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఎప్పటినుంచో మరుగున పడింది. ఇంకొంచెం ముందుకు పోతే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం కనిపిస్తుంది. వీటన్నింటినీ దాటుకుని ఇంకా ముందుకు వెళ్తే జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం చిరునవ్వులు చిందిస్తూ పలుకరిస్తుంది. నేతాజీ రోడ్డును కచ్చితంగా 72 అడుగులకు విస్తరించనున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు వెడల్పు సుమారు 40 అడుగులు ఉంటుంది. అంటే ఇంకా 32 అడుగులు అటూఇటూ విస్తరించాల్సి ఉంటుంది. దీంతోపాటు ఆర్టీసీ బస్టాండును కాస్త వెనక్కు జరిపి, షాపింగ్ కాంప్లెక్స్‌తోపాటు ఇంకా పలు అభివృద్ధి పనులు చేయాలన్నది ప్రణాళిక. ఈ పనులన్నీ జరగాలంటే పైన పేర్కొన్న మొత్తం విగ్రహాలన్నింటినీ కచ్చితంగా తొలగించి తీరాలి. ఈ తొలగింపులో ఆయా రాజకీయ పార్టీలు, కులాలు, సామాన్య ప్రజల మనోభావాల సమస్య తలెత్తుతుంది. ఎలాగోలా విగ్రహాలను తొలగించినా.. అలా తొలగించిన విగ్రహాలను తిరిగి ఎక్కడ ప్రతిష్ఠించాలన్న సమస్యపై ప్రస్తుతం అధికార వర్గాలు, ప్రజల్లో చర్చ నడుస్తోంది. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం కుప్పం పురపాలక సంఘం పరిధిలో 18 కూడళ్లు ఏర్పాటు కానున్నాయి. నేతాజీ రోడ్డు వెంట తొలగించిన విగ్రహాలను ఈ కూడళ్లలో పునః ప్రతిష్ఠించాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అయితే విగ్రహాలు ఉండటంతో కూడళ్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందన్న వాదన సాగుతోంది. అలా కాకుండా కుప్పం చెరువు కట్ట (ట్యాంక్ బండ్)పై విగ్రహాలను వరుసగా పునః ప్రతిష్ఠిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన దీనికి సమాంతరంగా సాగుతోంది. ఈ ఆలోచనవైపు పలువురు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నేతాజీ రోడ్డు విస్తరణ ప్రక్రియలో పరిహారం సమస్యతోపాటు ప్రస్తుతం విగ్రహాల సమస్య అధికారులను సవాల్ చేస్తోంది.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

కుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని అనధికార లే అవుట్లను వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు వాటి యజమానులను కోరారు. దీనికోసం ప్రభుత్వం లే అవుట్స్ రెగ్యులరైజేషన్ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) అమలు చేస్తున్నదన్నారు. 2025వ సంవత్సరం జూన్ 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ పొందిన ప్లాటును ఈ పథకం కింద క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. దీనికోసం జూలై 26 నుంచి 90 రోజుల్లోగా ప్లాటు యజమానులు ఆన్‌లైన్ వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సులభతరం చేశామన్నారు. అలాగే క్రమబద్ధీకరించుకున్న లే అవుట్లకు మౌలిక వసతులైన సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు పురపాలక సంఘమే సమకూరుస్తుందన్నారు. అలాగే క్రమబద్ధీకరించుకున్న ప్లాట్లకు బ్యాంకు నుంచి రుణ సదుపాయం లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

బంగారు దుకాణాలపై దాడులు



మూత వేసిన బంగారు దుకాణం

పుంగనూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారు దుకాణాలపై తిరుపతి లీగల్ మెట్రాలజీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి మంగళవారం దాడులు నిర్వహించారు. స్థానిక జమీందార్ ప్యాలెస్ సమీపంలోని బంగారు దుకాణంలో కొలతలు, తూనికలు మిషన్లను పరిశీలిస్తుండగా పట్టణంలోని మిగిలిన దుకాణాలు మూసి వేయడంతో పలు అనుమానాలకు దారి తీసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాదారులు మూసివేయడం సరికాదని.. మళ్లీ దాడులు చేయాల్సి ఉంటుందని తెలిపారు.


దళిత సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇచ్చిన అధికారులు సమావేశానికి హాజరుకాలేకపోవడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సంఘ నాయకులు అశోక్‌కుమార్, నరసింహులు, ఎమ్మార్పీఎస్ కన్వీనర్ నరసింహులు, మాజీ కౌన్సిలర్ కృపాకర్, శ్రీనివాసులు, చిన్నబ్బ, రాజన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ

పుంగనూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా జ్వరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ముడిపాపలనపల్లె వైద్యాధికారి స్రుజన కోరారు. మంగళవారం మండలంలోని అడవినాథునికుంట పాఠశాలలో డెంగీ, మలేరియా, జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భోజన సమయంలో చేతులు శుభ్రం చేసుకోవాలని.. యుక్త వయస్సు కలిగిన బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

6న శుభారాం కళాశాలలో ఉద్యోగ మేళా

పుంగనూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 6న శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు 11 బహుళ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరై ఉపాధి పొందాలని ఆయన కోరారు.

సాంకేతిక పద్ధతులతో పట్టు దిగుబడుల పెంపు

ఎమ్మెల్సీ కంచర్ల



విజ్ఞాన యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టుసాగులో సాంకేతిక పద్ధతులను సమర్థంగా అమలు చేయడంతో దిగుబడులు పెంచుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం పట్టు రైతులకు పిలుపునిచ్చారు. పట్టుసాగులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కర్ణాటక రాష్ట్రం మైసూరు ప్రాంతంలో సాగు విధానాలను అధ్యయనం చేయడానికి కుప్పం పట్టురైతులు మంగళవారం విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. ఈ బస్సుయాత్రను ఎమ్మెల్సీ, పీఎస్‌ఎంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు కుప్పం పట్టు సాగుకు ప్రసిద్ధంటా ఉంటూ ఆ రంగంలో ఇక్కడి రైతులు ఎన్నో రాష్ట్ర, జాతీయ అవార్డులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టు రైతుల గురించి పట్టించుకునేవారే లేకుండా పోయారన్నారు. తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన నియోజకవర్గంలో పట్టు రైతులను సాంకేతిక పద్ధతులతో ప్రోత్సహించడానికి ఈ విజ్ఞాన యాత్రను సంకల్పించినట్లు చెప్పారు. అవసరమైన సబ్సిడీలు అందిస్తూ ప్రభుత్వం పట్టు రైతులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్‌తోపాటు పట్టు రైతులు, సెరికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న మనోహర్ తదితరులు

రామకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పాలరేవుగడ్డలో ఉన్న బాలమురుగన్ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కొత్తగా ప్రతిష్ఠించనున్న వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, దక్షిణామూర్తి, పార్వతీదేవి, బాలమురుగన్, వినాయకస్వామి విగ్రహాలకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను పాలరేవుగడ్డ, కెంచనబల్ల, సింగసముద్రం, విజలాపురం, ఆనిగానూరు, గోవిందపల్లె తదితర గ్రామాల్లో ఊరేగించారు. పూజల్లో సీఎం చంద్రబాబు పీఏ మనోహర్ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, నేతలు శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, నాగభూషణం, నల్లి, అవినాశ్, రామలింగారెడ్డి, కృష్ణప్ప, గిరిదాసు, మునిరత్నం, శ్రీనివాసులు, హనుమంతు, బద్రీ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న పుంగనూరు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

పుంగనూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందించిన సేవా కార్యక్రమాలను గుర్తించిన ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ పుంగనూరు లయన్స్‌క్లబ్‌కు పలు అవార్డులు అందించినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్సవాల్లో బెస్ట్ అంబాసిడర్‌గా సేవలు అందించిన పుంగనూరుకు చెందిన డాక్టర్ శివకు డిస్ట్రిక్ ఇంపాక్ట్ అవార్డు, లయన్స్ క్లబ్ కార్యదర్శిగా పనిచేసిన సురేశ్‌కు బెస్ట్ ఇంపాక్ట్ అవార్డులను ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.



● కల్లూరు: బెంగళూరు నగరం కోరమంగళ్ ఆడిటోరియంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసినట్లు జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదలి తెలిపారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు పీవీ కృష్ణారెడ్డి, రామరాజ్, ఉప గవర్నర్ ప్రతాప్‌యాదవ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి

పలమనేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులకు అర్హతను బట్టి రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ మీటింగ్ హాల్‌లో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణం తీసుకొని సక్రమంగా రుణాలు తిరిగి చెల్లించిన వారికి రుణం పెంచివ్వాలని, ముఖ్యంగా వీధి వ్యాపారులు, చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎల్‌డీఎం హరీష్ మాట్లాడుతూ అర్హత, రీపేమెంట్‌ను బట్టి లక్ష్యాల మేరకు రుణాలు అందిస్తామన్నారు. సమావేశంలో పలమనేరులోని బ్యాంకు అధికారులు, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మెప్మా అధికారి బాబా పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిపై ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు పోస్టుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు నూర్‌బాషా, కరుణాకర్‌నాయుడు, ఖాదర్‌వల్లి, అష్రఫ్, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు అబ్బాస్, సర్దార్‌బాషా, ఇమ్రాన్, రాజేంద్ర, ఖాసింసాహెబ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక నిద్రమాత్రలు మింగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పట్టణంలోని టీబీకాలనీకి చెందిన శంకర్ భార్య లత(45) భర్త బెంగళూరులో కూలీ పనులు చేస్తుండగా పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేసుకుని జీవనం సాగిస్తోంది. అయితే పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రూ.60 వేలు రుణం తీసుకుంది. ప్రతి నెలా రూ.3200 చెల్లిస్తుండగా గత మూడు నెలలుగా కుటుంబ ఇబ్బందులు కారణంగా డబ్బులు చెల్లించకపోవడంతో కంపెనీకి చెందిన కొందరు ఇంటి వద్దకు రావడంతో అవమానం భరించలేక నిద్రమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

'పట్టాలిచ్చినా స్థలాలు చూపలేదు'

గంగవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లె, ఏడూరు గ్రామాల్లో నిరుపేదలకు పట్టాలిచ్చి స్థలాలు చూపించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని కలగటూరు ఎంపీటీసీ భారతి అధికారులను ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖ ప్రగతి వివరాలను చదివి వినిపించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టీజీవీ ప్రసాద్, తహశీల్దార్ రేఖ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే థామస్‌కి సన్మానం



ఎమ్మెల్యే థామస్‌ను సన్మానిస్తున్న కొప్పేటి ప్రసాద్ తదితరులు

వెదురుకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పర్యటన నిమిత్తం వచ్చిన జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌ను జీడీనెల్లూరు కాపు సేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత కొప్పేటి ప్రసాద్ మంగళవారం సన్మానించారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, కార్వేటినగరం టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకరరెడ్డి, బీజేపీ నాయకుడు రాజశేఖర్, సీహెచ్‌వో మధు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై ప్రయాణించిన ఎమ్మెల్యే కార్వేటినగరం మండలంలోని అల్లాగుంట ఎమ్మెల్యే సొంత గ్రామం. ఆ గ్రామానికి తన హయంలో వేసిన సిమెంటు రోడ్డుపై బుల్లెట్‌లో ఆయన ప్రయాణించారు. బుల్లెట్‌ను తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకరరెడ్డి రైడింగ్ చేశారు. కాగా, ఆర్కేవీబీపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు నాగభూషణంరెడ్డిని థామస్ పరామర్శించారు. కార్వేటినగరానికి చెందిన టీడీపీ కార్యకర్త ప్రభాకర్(70) అనారోగ్యం మృతి చెందడంతో మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయం అందించారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ



పచ్చికాపల్లంలో కార్యదర్శికి సూచనలిస్తున్న డీపీవో సుధాకరరావు

వెదురుకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లంలో జరుగుతున్న ఐవీఆర్ఎస్ పనుల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ పనులను జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు మంగళవారం తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి పన్ను వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయనవెంట కార్యదర్శి వెంకటేశులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ● గొడుగుచింత గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ పనులను ఎంపీడీవో పురుషోత్తం తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యదర్శి నరేష్ ఉన్నారు.

చంద్రబాబు హయాంలోనే సుపరిపాలన: టీడీపీ



జి.గొల్లపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

తవణంపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి అన్నారు. మంగళవారం జిగొల్లపల్లెలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, నేతలు ధనంజయనాయుడు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

పూతలపట్టు బీఎస్పీ అధ్యక్షుడిగా పూర్ణచంద్ర

ఐరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా ఉప్పలపాటి పూర్ణచంద్ర ఎంపికైనట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు సురేంద్ర తెలిపారు. పూర్ణచంద్ర మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

విద్యాసామగ్రి వితరణ



బంగారుపాళ్యం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుండ్లకట్టమంచి ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయా ట్రస్టు ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, నిర్వాహకులు ఈశ్వర్‌నాయుడు, మమత, కళ్యాణ్‌లు నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లను మంగళవారం అందజేశారు. నాయకులు ఎన్పీ జయప్రకాష్, జనార్దన్‌గౌడ్, హేమచంద్రనాయుడు, మాధవనాయుడు, ఎంఈవోలు, హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



వెదురుకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన, కొత్తగా వచ్చిన ఉద్యోగులకు కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మమత ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం మంగళవారం జరిగింది. బదిలీపైవెళ్లిన సీడీపీవో పద్మనంద, సూపర్‌వైజర్లు ఇందిర, షామిని, ఉద్యోగి రామకృష్ణను, అలాగే ఇక్కడ విధుల్లో చేరిన సీడీపీవో పగడాల శోభారాణి, సూపర్‌వైజర్ రోజారమణి, ఉద్యోగులు రమేష్‌బాబు, మురళి సన్మానించారు. నాయకులు మమత, సుగుణ, రాణి, వళ్లెమ్మ, తేజావతి, నాగమ్మ, మంజుల పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం

● నగరి పీఏసీఎస్ చైర్మన్



జంగమాల కండ్రిగలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

నగరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయమని నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజి అన్నారు. గుండ్రాజుకుప్పం పంచాయతీలోని జంగమాలకండ్రిగ 96వ బూత్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు.టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, నాయకులు ఉమాపతిరాజు, రవి, సుబ్రహ్మణ్యంరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. మంగళవారం నగరంలోని 27వ డివిజన్ పరిధిలో పర్యటించారు. గంగినేని చెరువు వద్ద డీపెనింగ్ చేసి కొత్త మోటరు బిగించిన బోరును ప్రారంభించారు. అనంతరం స్థానిక వార్డు సచివాలయంలో రికార్డులను, కాజూరు చెరువును పరిశీలించారు. చెరువు సుందరీకరణపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కార్పొరేటర్ ఇందు, నాయకులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్రైనేజీ పైపులు అమరుస్తున్న కార్మికులు

పెనుమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పెనుమూరు మార్గంలో టీవీ కాలనీ వద్ద రోడ్డుపక్కన మురుగు గుంతను శుభ్రం చేశారు. నూతన డ్రైనేజీ పైపులను ఏర్పాటు చేసి మురుగును చెరువులోకి మళ్లించారు. 'రోడ్డుపై పారుతున్న మురుగు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోండి: ఏసీపీ

చిత్తూరు అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ నాగేంద్ర తెలిపారు. మంగళవారం నగరపాలక సమావేశపు హాలులో ఈ స్కీమ్‌పై ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డ్ ఇంజనీర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీకి ముందు వేసిన లేఅవుట్లను ఈ స్కీమ్ కింద క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ప్లాట్ విలువ ఆధారంగా చార్జీలు ఉంటాయన్నారు. 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14 శాతం అదనపు చార్జీలు విధిస్తామన్నారు. సంబంధిత పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శుభప్రద, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



గుడిపాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను చీలాపల్లెకు చెందిన గజలక్ష్మికి (రూ.54,925), కొండాపురం నవనీతకు (రూ.60,469)కి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం అందించారు. టీడీపీ నాయకులు బొడెబ్బనాయుడు, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాకు పింఛను ఇప్పించయ్యా..!

దివ్యాంగుడైన చిన్నారి వేడుకోలు



రెండు కాళ్లూ కోల్పోయిన జగదీష్

పెనుమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 'నాకు పింఛను ఇప్పించయ్యా..!' అంటూ పెనుమూరు మండలం కేసీపల్లె పంచాయతీ గొల్లపల్లె దళితవాడకు చెందిన దివ్యాంగుడైన చిన్నారి ఎం.జగదీష్ వేడుకుంటున్నాడు. 'నా తండ్రి మునిరత్నంతో కలిసి గత ఏడాది పెనుమూరు నుంచి కొత్తపల్లెమిట్టకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుడ్యాణంపల్లె మలుపు వద్ద మమ్మల్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నా తండ్రికి చెయ్యి, నాకు రెండు కాళ్లూ పోయాయి. అప్పటినుంచి నా తండ్రి పనిచేయలేని దుస్థితి. నాకు ఇద్దరు అక్కలున్నారు. మా అమ్మ కూలిపనికెళ్తేనే మా ఐదుగురికీ బువ్వ దొరుకుతుంది' అని ఆ చిన్నారి వాపోయాడు. పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదన్నాడు. కలెక్టర్ స్పందించి తమను ఆదుకోవాలని కోరాడు.

త్వరలోనే చిత్తూరులో ప్రధాన రోడ్ల విస్తరణ : ఎమ్మెల్యే జగన్మోహన్



రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు పారెస్టు రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం పీవీకేఎన్ కళాశాల నుంచి మెసానికల్ మైదానం వరకు రూ.5 కోట్లతో నిర్మించిన 3.1 కి.మీ రోడ్డును కలెక్టర్ సుమిత్ కుమార్, మేయర్ అముదతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయడంతోపాటు నూతన రోడ్ల నిర్మాణం చేపట్టిందని చెప్పారు. నగరంలో ప్రధానమైన కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, హైరోడ్డు, ఇరువారం రోడ్ల విస్తరణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కట్టమంచి - పొంబయ్య కండ్రిగ బైపాస్ రోడ్డును కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, వెంకటేశ్వర చౌదరి, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కూటమి పార్టీల నేతలు సురేంద్ర కుమార్, జగదీశ్వర నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థలి సంఘటనపై నిజాయితీగా విచారణ చేపట్టాలి: మహిళా సమాఖ్య



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏపీ మహిళా సమాఖ్య నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థలి సంఘటనపై కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ఈ మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కార్యదర్శి విజయగౌరీ మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలి పుణ్యక్షేత్రంలో మహిళలపై హత్యాచారాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. నాయకులు జమిలాబీ, కోమల, సుగుణ, బుల్లెమ్మ, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం: థామస్



కొట్రకోన దళితవాడలో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న వీఎం థామస్

గంగాధరనెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని వీఎం థామస్ తెలిపారు. మంగళవారం రాత్రి కొట్రకోన దళితవాడలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 వతేదీనుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితప్రయాణం సాగించడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లును సీఎం పూర్తి చేశారన్నారు. అలాగే కలిజవేడు పంచాయతీలో కె.నాశంపల్లె, కె.వెంకటాపురం దళితవాడల్లో, కె.నాశంపల్లె ఆదిఆంధ్రవాడ, ఎస్టీకాలనీలోనూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీనేతలు స్వామిదాస్, దేవసుందరం, నరసింహులునాయుడు, చంద్రబాబు గౌడ్, హరీష్‌యాదవ్, ప్రభాకర్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు, హరిబాబునాయుడు, విశ్వనాథనాయుడు, కామసాని కోదండరెడ్డి, దేవపత్ని కిరణ్‌నాయుడు, ప్రభాకర్ యాదవ్, కేశవులు గౌడ్, రామ్మూర్తి, వెంకటాచలం, సుబ్బయ్య గోపాల్, గుర్రప్ప జమీర్, మునిరాజుల యాదవ్, నియాజ్ అలీ పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగింపు

యాదమరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ వీధిలో దారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాన్ని అధికారులు మంగళవారం తొలగించారు. ప్రాథమిక పాఠశాల వీధిలో నూర్జహాన్ అనే మహిళ రోడ్డును ఆక్రమించారని అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు వచ్చి ఆక్రమణలను తొలగించారు. డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, కార్యదర్శి శివరాజ్, వీఆర్వో పోలీసులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



నగరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురంలో ఈనెల 27న జరిగిన బాడీబిల్డర్ పోటీల్లో విజేతలను నగరిలోని తన కార్యాలయంలో డీఎస్పీ అజీజ్ అభినందించారు. పోటీల్లో నగరికి చెందిన అస్లాం ప్రథమ, పుత్తూరుకు చెందిన దినేష్‌కు ద్వితీయ బహుమతులను సాధించారన్నారు.

23 మంది ఉద్యోగాలకు ఎంపిక



విజ్ఞాన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

బంగారుపాళ్యం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజ్ఞాన్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలను బెంగళూరుకు చెందిన 24/7 ఏఐ సంస్థ నిర్వహించింది. ఇంటర్వ్యూలకు 77మంది విద్యార్థులు హాజరవగా 23 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వెంకటాచలం తెలిపారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు: టీడీపీ



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం నింద్ర మండలం ఆరూరు పంచాయతీ ఎస్టీ కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘుయాదవ్, డిల్లీరాజు, ఓబుల్‌రాజు, గోవిందరాజు, ధనరాజు, రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు

నగరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): టీఆర్ కండ్రిగలోని దేశమ్మ ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన నాగరాజన్ మంగళవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ ఉత్సవ పర్యవేక్షకులు మదన్, మణిరెడ్డి, ఏఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడ, నాగ పంచమి పూజలు

గంగాధరనెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గరుడ, నాగ పంచమి పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుస్వామి, ఆలయ మాజీ ట్రస్టీ సతీమణి సుమిత్రా శ్రీధర్, అర్చకులు గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్ భక్తులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం



సదస్సులో ప్రసంగిస్తున్న అన్నయ్యనాయుడు

చిత్తూరు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి):తెలుగు భాషను కాపాడుకుందామని ప్రముఖ సాహితీవేత్త అన్నయ్య నాయుడు పిలుపునిచ్చారు. సంతపేట పీఎస్‌సీ నగరపాలక పాఠశాలలో హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో సాహితీవేత్తల సదస్సు మంగళవారం జరిగింది. వి.హరినాయుడు, పత్తిపాటి రమేష్‌నాయుడు, బి.బాస్కర్‌రెడ్డి, గోవిందన్ పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలోనే మహిళాభివృద్ధి'

చిత్తూరు సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే మహిళాభివృద్ధి సాధ్యమని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా సంఘాలపై ప్రభుత్వం వరాల జల్లు కురిపిస్తోందని పేర్కొన్నారు. స్త్రీనిధి కింద రుణసాయం రూ.3.5లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచిందన్నారు. ఆగస్టు 15వ తేదీనుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తారని వివరించారు.

'నాటక రంగానికి చేయూతనిద్దాం'

చిత్తూరు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాటరంగానికి చేయూతనిద్దామని సిటిజన్ ఫోరం సభ్యులు పిలుపునిచ్చారు. మిట్టూరు పోలీస్ టాప్‌లైన్‌లోని శ్రీ రామ భజనమందిరంలో 'రామాయణ సౌండ్ అండ్ లైట్ షో' కళాకారుల సక్సెస్ మీట్ జరిగింది. ప్రదర్శన ప్రధాన సూత్రధారి కోడి కిషోర్‌తోపాటు కళాకారులను సత్కరించారు. ఓం శ్రీధర్ రెడ్డి, పార్థసారధి నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'నాగపంచమి' పూజలు



పొన్నియమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చిత్తూరు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగపంచమి సందర్భంగా నాగ ప్రతిమలకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పొన్నియమ్మ గుడిలో ట్రస్టీ సీకే లావణ్యబాబు ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు.

పాఠశాలను యథావిధిగా కొనసాగించండి

● గొల్లకండ్రిగలో నిరసన తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు



వెదురుకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం గొల్లకండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను సమీపంలో కేఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు తరలించారు. దీనిపై గొల్లకండ్రిగలోని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ఓ వర్గంపై దాడి: నలుగురికి గాయాలు





గాయపడ్డ యువకులు

గంగాధరనెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కట్టకిందపల్లె దళితవాడలో ఓ వర్గంపై మరో వర్గం దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. కట్టకిందపల్లె దళితవాడకు చెందిన చిన్నమ్మను, ఆమె సోదరుడైన డిల్లీబాబును అదే దళితవాడకే చెందిన రజని సోమవారం సాయంత్రం దూషించి, చేయి చేసుకున్నాడు. ఇది తెలిసి రజనిని చిన్నమ్మ కుమార్తె మాధవితోపాటు దుర్గాప్రసాద్, చిరంజీవి, రాజా, వెంకటేష్ ప్రశ్నించారు. ఆగ్రహించిన రజని తన వర్గీయులైన సుబ్రహ్మణ్యం, రామ్‌రాజ్, మైకేల్, గిరితో కలిసి దాడి చేశారు. దీంతో దుర్గాప్రసాద్, చిరంజీవి, రాజా, వెంకటేష్‌లకు గాయాలయ్యాయి. బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరికి తీవ్రగాయమవడంతో తమిళనాడు వేలూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో పోలీసులకు మాధవి ఫిర్యాదు చేశారు. దీంతో రజని, మైకేల్, రామ్‌రాజ్, సుబ్రహ్మణ్యం, గిరిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

జేసీ తనిఖీలు



బంగారుపాళ్యం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ విద్యాధరి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డుల గదిని పరిశీలించి.. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు పలు సూచనలు ఇచ్చారు. తోతాపురి మామిడి రైతుల సబ్సిడీ వివరాలను వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు భారతి, సాగరికలను అడిగి తెలుసుకున్నారు. డీటీ కళ్యాణి, సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించొద్దు: డీఎస్పీ

యాదమరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. మంగళవారం యాదమరి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్ఐ ఈశ్వర్, రైటర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంకాలమ్మకు క్షీరాభిషేకం

చిత్తూరు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడువీధిలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో ఆడిమాసం సందర్భంగా అమ్మవారికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. నిర్వాహకుడు కేఎం కుమార్, అర్చకుడు బికుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నేత మృతి

విజయపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఖూరికాపురానికి చెందిన బీజేపీ సీనియర్ నేత నారాయణరాజు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

నోటు పుస్తకాల వితరణ

వెదురుకుప్పం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం చాముండేశ్వరి మంగళవారం నోటు పుస్తకాలను వితరణ చేశారు. 300 మంది పిల్లలకు అందజేశారు.

నాగదేవతలకు పూజలు

బంగారుపాళ్యం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ఆవరణంలోని నాగదేవతలకు నాగపంచమి సందర్భంగా దాతలు అట్లూరి వేణుగోపాల్ కుటుంబీకులు మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బుసా నాగరాజ గౌడ్, అట్లూరి ఎల్లప్ప గౌడ్, శివలింగయ్య, రాజేంద్రనాయుడు, శంకరయ్య రామ్మూర్తి నాయుడు, తులసీబాబు, మేనేజర్ మొగిలప్ప, భక్తులు పాల్గొన్నారు.

చింతచెట్టు తొలగింపు

యాదమరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యాదమరి బస్టాండ్ వద్ద కూలడానికి సిద్ధంగా ఉన్న చింతచెట్టును మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, యాదమరి పంచాయతీ కార్యదర్శి శివరాజ్ తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, జూలై 29(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు బోధించడానికి అతిథి అధ్యాపకుడి (గెస్ట్ లెక్చరర్) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ పిస్వరూప తెలిపారు. ఈ నెలాఖరులోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

గుడిపాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పశుమంద ఎస్టీకాలనీలో రైతులకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని ఏడీఏ నాగప్పన్ని మంగళవారం నిర్వహించారు. రసాయనాలను వాడకుండా కూరగాయలు పండించుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏవో సంగీత, సహాయకులు సోనియా పాల్గొన్నారు.